# పెన్షనర్

- ఆకెళ్ల రామచంద్రరావు

శ్రీనివాసరావుగారు ఈ మధ్య రిటైరయ్యారు. రెండు నెలల్లో ఆయన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేసాయి. ఇంత సకాలంలో ఈ రోజుల్లో అవి రావడం - గొప్ప విశేషమని మిత్రులు, శ్రేయోభిలాషులూ, ఇంట్లో వారూ ఎంతో మెచ్చుకున్నారు. "వాటి కోసం తను సర్వీసులో వుండగానే అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాను. అన్ని పేపర్లూ సకాలంలో పంపేసాను. మిత్రులతో కూడా చెప్పి ఏ పేపరూ ఎక్కడా డిలే కాకుండా చూసుకున్నాను... అందువల్లనే రిటైర్మెంట్ బినిఫిట్స్ సరిగ్గా టైముకి వచ్చేసాయి......" చిరునవ్వుతో చెప్పారాయన.

శ్రీనివాసరావుగారికి ఇద్దరబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలూను. పెద్దబ్బాయి రఘు భార్య శ్రీలత తండ్రితోనే వుంటున్నారు. చిన్నబ్బాయి వినోద్ విదేశాల్లో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. అమ్మాయిలు సుమ, సుధల పెళ్ళిళ్ళు ఆయన సర్వీసులో వుండగానే చేసేశారు. సుమ భర్త సురేష్ ఈ ఊళ్లోనే వుంటున్నారు. సుధ మాత్రం బెజవాడలో ఉద్యోగం చేస్తూ భర్త సుధీర్‌తో వుంటోంది. ఇదీ ఆయన కుటుంబ చిత్రం.

శ్రీనివాసరావుగారు రిటైరైనందుకు చాలా మందిలా అధైర్య పడిపోలేదు. బెంబేలు పడిపోలేదు. పరిస్థితిని, కుటుంబ స్థితిని, ఆదాయ వ్యయాలను ముందుగానే బేరీజు వేసుకున్నారు గనక రిటైర్డ్ లైఫ్ ఎలా గడపాలో ఖచ్చితమైన నిర్ణయాలు, ప్లానింగూ చేసుకున్నారు.

చాలా మంది ఉద్యోగులు రిటైర్డ్ లైఫ్ సరిగ్గా ప్లాన్ చేసుకోక, ఊహించక, సడెన్‌గా రిటైరైతే వెన్ను విరిగి మీద పడ్డట్టు సైకలాజికల్‌గా ఫీలై నిరాశ నిస్పృహలకు లోనవుతుంటారు. డి ప్రెస్ అయిపోతుంటారు. తిండి, నిద్ర, కట్టు బట్టల మీద కూడా శ్రద్ధ చూపడం మానేసి గడ్డాలు పెంచుకుని ఏదో ఏమో భారం మీద పడినట్టు ప్రవర్తిస్తుంటారు. "మనదేముంది? అంతా అయిపోయింది. ఈ వచ్చే ఫించన్ రాళ్ళతో ఈ జీవితం ఎలా గడపాలి? చివరి వాడి చదువు ఏం చేయాలి? ఆఖరు అమ్మాయి పెళ్ళి కుదరనే లేదు.... నాకా సుగర్ రోగం వచ్చేసింది. మందులకూ, మాకులకు ఏం కావాలో? ఆరోగ్యం ఏమీ బాగా లేదు. జీవితం ఎలా వెళ్తుందో.....' ఇలాంటివి చెప్పుకునేవి, చెప్పుకోలేని దిగుళ్ళతో సతమతమవుతుంటారు.

ఉన్న పాతకారు, స్కూటరు కూడా అమ్మేసి బస్సులోనో, సైకిలు మీదో కూడా వెళ్ళే ప్రయత్నం చేస్తుంటారు. మరి కొందరు కాస్త వంట్లో శక్తీ, శౌర్యం వున్న వాళ్లు పార్ట్ టైమ్ ఉద్యోగం ఎక్కడైనా దొరుకుతుందాని ఆరాలు తీస్తూ, ప్రయత్నాలు చేస్తుంటారు.

శ్రీనివాసరావుగారు రిటైర్మెంట్‌కి మానసికంగా, శారీరకంగా, అఫిషియల్‌గా, అనఫిషియల్‌గా ప్రిపేరైపోయి వున్నారు గనక, ఉద్యోగం హోదాలోనే పిల్లల బాధ్యతలు చక్కబెట్టేసుకున్నారు గనకా, నిశ్చింతగా వున్నారు. పైగా సోఫా సెట్, కొత్త కలర్ టీవీ, టెలిఫోను వగైరా సౌకర్యాలు సర్వీసులో వున్నప్పుడు లేనివి సమకూర్చుకున్నారు. ఇంకా చెప్పాలంటే, పాత కాలం చెత్త మంచాలు తీసి పారేసి డబుల్ కాట్, ఫాం బెడ్స్ కూడా కొనుక్కున్నారు. దానిపై పెద్ద కొడుకు రఘు, కోడలు శ్రీలత కనుబొమలు ఎగరేసి ఆశ్చర్యం ప్రకటించినా, పెదవి దాటి మాట బయటకి రాకుండా జాగర్త పడ్డారు. ఎందుకంటే వాళ్లకి తెలుసు, మాట పెదవి దాటితే పృధ్వి దాటుతుందని. వాళ్లు ఆ ఇంట్లో అత్త మామతో కలసి మెలసి సుఖ జీవనం సాగిస్తున్నారు. బయటకు వెళ్లి మరో అద్దె ఇంట్లో సొంత కాపురం వెలగబెట్టే స్థోమత వారికి లేదు. రఘుది చిన్న ఉద్యోగం. ఉన్నంతలో తండ్రి తల్లి పంచన వుండి కాలం వెళ్ల దీస్తున్నాడు.

"విన్నారా చోద్యం! మామగారు, అత్తగారు కొత్త మంచాలు పరుపులూ కొనుక్కున్నారు...." అంది రాత్రి బెడ్‌రూమ్‌లో శ్రీలత.

"వాళ్ళ డబ్బుతో వాళ్లు కొనుకుంటే నువ్వేవరు కామెంట్ చెయ్యడానికి? మీ నాన్న దగ్గర కట్నం పీడించి, ఆ డబ్బుతో కొనుక్కోలేదు గదా?" అన్నాడు రఘు.

"మాటికి ముందు మా వాళ్ళ గొడవ ఎత్తుతారెందుకు? ముసలాళ్ళకి పట్టి మంచాలు, ఫోమ్ బెడ్సు కావల్సి వచ్చాయి. అందుకు చెబుతున్నా......"

"ఎక్కువ మాట్లాడద్దు.... మనమేదో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాం ఇక్కడ. వాళ్లు కొన్నారే అనుకో ఎక్కడికి పోతాయి చివరికి మనకే ఉపయోగ పడతాయి. ఈ నగ్న సత్యాన్ని గుర్తు పెట్టుకో...." అన్నాడు రఘు.

శ్రీలత సాలోచనగా వుండిపోయింది.

"ఆడవాళ్ళు ఏ విషయం వచ్చినా, భావావేశాన్ని అదుపులో పెట్టుకోలేరు. బడబడా వాగేస్తారు. దాని ఫలితాల్ని తీరు బాటుగా అనుభవించి మళ్ళీ బాధపడ్తూ వుంటారు"తనే అన్నాడు రఘు.

పోన్లెండి.... మిమ్మల్ని కదపడం నాదే తప్పయింది. పెద్ద స్పీచ్‌లు ఇస్తున్నారు."

"పెద్ద స్పీచ్‌లు కాదే, మనుషులు మర్మం తెలుసుకుని వారితో మన అవసరం గుర్తెరిగి మాట్లాడి ప్రవర్తించాలే.... మధుబాలా...." అంటూ ఆమెను సముదాయించాడు రఘు......... ఆ రాత్రి చల్లగా కరిగిపోయింది.

రోజులు గడిచిపోతున్నాయి.

శ్రీనివాసరావుగారు క్రమపీ రిటైర్డ్ జీవితానికి అలవాటుపడిపోతున్నారు. ఉదయం పూట వాకింగ్‌కి వెళ్ళి వస్తారు. ఆనక భార్య రుక్మిణమ్మ గారిచ్చిన కాఫి తాగి కాస్సేపు పేపర్ తిరగేస్తారు. తర్వాత స్నానాదులు ముగించుకుని పూజా కార్యక్రమం. అదో గంట సాగుతుంది. అనక భార్య భోజనానికి పిలిచేదాకా పుస్తక పఠనం. తర్వాత కాసేపు భార్యతో పిచ్చాపాటీ, మధ్యాహ్నం పుస్తకం పఠనం, ఓ గంటసేపు నిద్ర, సాయంత్రం వ్యాహ్యాళి తిరిగొచ్చి టీవీ ఎదురుగా భార్యతో మాట మంతీ, రాత్రి ఎనిమిదిన్నరకి భోజనం, తిరిగి టీవీ వీక్షణం పదకొండొంటికి నిద్ర - సుమారుగా పెద్ద తేడాలేవీ లేకుండా ఇదే ఆయన దిన చర్య.

ఈ మధ్య పెద్ద కోడలు శ్రీలత నెలతప్పింది. వేవిళ్లతో సతమత మవుతోందని భార్య ద్వారా తెలిసిందాయనకు. ఆడపిల్లలకి ముందుగానే పెళ్ళిళ్లు చేసేయడం వల్ల ఆయన సర్వీసులో వుండగానే తాతయిపోయారు. ఇప్పుడు కొత్తగా తాత అయే సంతోషం లేక పోయినా కొడుకు బిడ్డను ఎత్తుకుని ఆడించే భాగ్యం పడుతున్నందుకు ఎంతగానో సంతోషించారు.

కోడలికి నెలలు నిండుతుండటం - వేవిళ్ళతో నీరసాచిపోవడంతో రుక్మిణమ్మగారు ఇంటి పని, వంట పనీ తనే స్వయంగా చేసుకుంటున్నారు.

ప్రసవ సమయం రానే వచ్చింది. వాళ్ళ పుట్టింటి వారిది చిన్న ఊరు కావడంతో ఇక్కడే పెద్ద ఆసుపత్రిలో పురుడు పోయడానికి ఏర్పాట్లు చేసారు.

అనుకున్నట్టుగానే శ్రీలత మగ బిడ్డకు జన్మనిచ్చింది.

ఇంట్లో అందరి ఆనందానికి అవధులులేవు. ఇరుగు పొరుగులకి మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని వ్యక్త పరుచుకున్నారు.

అయితే ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు.



ఓ రోజు హాస్పిటల్ నుంచి వచ్చిన రఘు నీరసంగా, ముఖం చిన్న బుచ్చుకుని కనబడ్డాడు శ్రీనివాసరావు గార్కి.

"ఏమిట్రా! అలా వున్నావు? వంట్లో బాగోలేదా?"

"బాగానే వుంది....."

"మరేమిటలా కనిపిస్తున్నావ్? ఎనీ ప్రోబ్లం?"

"ఈ రోజే డాక్టర్ చెప్పింది. పిల్లవాడికి శ్వాస సరిగా లేదట. స్పెషలిస్టులతో చెక్ చేయిస్తానంది. గుండెలో ఏదో లోపం వుందని అనుమాన పడుతోంది." మెల్లగా చెప్పాడు రఘు.

విషయం విన్న శ్రీనివాసరావుగారు మ్రాన్పడి పోయారు. ఈ పసి కందుకి ఇంత లోపమా? గుండె సరిగ్గా లేదా? వీడితో ఎన్ని సమస్యలొస్తాయో? కానీ..... పైవాడే వున్నాడు.

"నువ్వేమి అధైర్య పడకురా! డాక్టరు అనుమాన పడుతోంది. ఇంకా పరీక్షలు చెయ్యాలిగా! అపుడు చూద్దాం" కొడుక్కి ధైర్యం చెప్పారేగాని ఆయన అంతరంగం అల్లకల్లోలంగానే వుంది.

మరునటి రోజు ముఖం వేలాడేసుకుని వచ్చాడు రఘు.

ఏమిటోనని వాకబు చేసిన శ్రీనివాసరావు గారు అనుమానించినంతే అయింది. 'పుట్టిన బిడ్డకి గుండె సరిగ్గా లేదట. ఎక్కడో చిన్న కన్నం పడిందట. ఏడాది దాటాక ఆపరేషను చేయాలట! దానికి లక్షరూపాయలు పైగా ఖర్చవుతుందట! ఆపరేషన్ చేస్తే బిడ్డ బ్రతికే అవకాశం వుంది. లేకపోతే లేదట.....' రఘు చెప్పిన విషయం విన్న అందరూ స్థాణువుల్లా అయిపోయారు.

ముందుగా శ్రీనివాసరావుగారే తేరుకున్నారు. "నువ్వేం అధైర్య పడకురా? డబ్బు నేను ఖర్చు పెట్టి ఆపరేషను చేయిస్తాను. అంతా మంచే జరుగుతుంది. బెంగ పెట్టుకోకు కొడుకును ఓదార్చారు.

శ్రీలత, రుక్మిణమ్మగారు, అందరూ బిడ్డతో అవస్థలు పడుతూ ఎలాగో ఏడాది పెంచుకు వచ్చారు. నిద్ర హారాలు మానుకుని కంటికి రెప్పలా కాపాడి సపర్యలు చేసారు.

ఆపరేషన్‌కు రంగం సిద్ధమయింది.

శ్రీనివాసరావుగారు లక్ష రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ కాన్సల్ చేసి మనవడి ఆపరేషన్ ఖర్చులు భరించారు.

అనుకున్నట్టు గానే అంతా సవ్యంగా జరిగింది.

ఆపరేషన్ సక్సెస్, నవ్వుతూ బిడ్డతో సహ ఇంటికొచ్చారు శ్రీలత దంపతులు.

కానీ ఇంకా ఎక్కువ శ్రద్ధతో పిల్లాడ్ని కని పెట్టుకుని వుండాల్సి వస్తోంది శ్రీలతకి.

అందరూ ఆమెకి అంతో ఇంతో సాయ పడుతున్నారు.

ఎంతయినా కొన్ని మన చేతుల్లో వుండవు. ఓ రోజు నిద్రపోతున్న బిడ్డ నిద్రలోనే కన్నుమూసాడు.

అందరూ ఘొల్లుమన్నారు.

ఆ ఇంట్లో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి.

"బిడ్డా పోయే సొమ్ముపోయె...... తొందర పడ్డాడు శ్రీనివాసరావు పుట్టుకతోనే అంత డిఫెక్టుతో పుట్టిన బడ్డకి ఆపరేషన్ ఎందుకు లక్షరూపాయలు ఖర్చు పెట్టి.... పోయాడో అయినా... వయసులో వున్న వాళ్ళకి మరో బిడ్డ పుట్టదా?" అంటూ బంధువులూ స్నేహితులూ చాటుమాటున అనుకున్నారు.

రెండు మూడు నెలలు గడిచాయి. శ్రీలత రఘు కూడా తల్లిదండ్రులతో ముభావంగా వుండడం మొదలెట్టారు.

ఓ రోజు ఉదయాన్న వాళ్ళింటి ముందు చిన్న ఖాళీ ట్రక్కు వచ్చి ఆగింది.

"నాన్నా! మేం వేరే వెళ్ళిపోతున్నాం. ఇక్కడుంటే బాబు దానికి అస్తమానం గుర్తొస్తున్నాడు...." చెప్పాడు రఘు.

"నీ ఇష్టంరా నేనేం చెప్పను?" అన్నారు శ్రీనివాసరావు గారు. సామాన్లు వేసుకుని రఘు, శ్రీలత వేరే ఇంటి వెళ్ళిపోయారు.

శ్రీనివాసరావుగారు, రుక్మిణమ్మ మాటలు డిగిన బొమ్మల్లా ఆ ఇంట్లో మసలసాగారు. వారి బాధను ఎవరితోనూ పంచుకోలేక.

రిటైర్డ్ లైఫ్ గడుపుదామనుకున్న శ్రీనివాస రావుగారు మరో రెండు నెలలకి పార్ట్‌టైమ్ ఉద్యోగం వేటలో పడడం ఆశ్చర్యం కాక మరేమిటి? ❋